

అన్నపూర్ణా వారి.....

వెలుగు నీడలు

నిర్మాత:
D. మధుసూదనరావు B.A.

దర్శకుడు:
ఆదుర్తి సుబ్బారావు

తారాగణం

సుగుణ	సావిత్రి బేబీశశికళ
వరలక్ష్మి	— గిరిజ
కనకదుర్గమ్మ	— సూర్యకాంతం
సుభద్రమ్మ	— సంధ్య
శాంతమ్మ	.... కమలాదేవి
సత్తి	.... సురభి కమలాబాయి
సుబ్బి	.... పార్వతి
శానిటోరియంనర్స్	- మీనాకుమారి
నర్తకి :	రాజసులోచన (గెస్టు ఆర్టిస్టు)
చంద్రం	— ఎ. నాగేశ్వరరావు
డా॥ రఘు	— జగ్గయ్య
రావుబహదూర్	— ఎస్. వి. రంగారావు
వెంగళప్ప	— రేలంగి
శివరాం	— పేకేటి
ప్రొఫెసర్	.... నటరాజన్
రిక్షావాలా	.... రామకోటి
కాలేజీవిద్యార్థులు	పద్మనాభం, రెడ్డి, బాబు, గౌతమ్, సారధి, శేషగిరిరావు, రంగారావు వగైరా.
ప్రెస్‌వర్కర్లు	కొండలరావు, రాఘవులు వగైరా.



వెలుగు నీడలు — కథ


బ్రిటిషు హయాం ఇండియాలో వెలిగిననాళ్లూ, రావుబహదూర్ వెంకటరామయ్యగారు గొప్పగా వెలిగారని చూసినవారు చెబుతారు – కాని ప్రస్తుతం ఆయన్ను చూస్తున్నవారికి మాత్రం ఆయన కాంతి, కళ్లు మిరుమిట్లుగొలిపేటంత కనబడటంలేదు. ఇపుడాయనకి ఉన్నదల్లా రావుబహదూర్ బిరుదు, దాన్ని గడించిపెట్టి, దరిమిలా బూజుపట్టిన "రాజసేవ" (అదే దేశసేవ) పత్రికా, తాతల నాటి మేడాను. ఆయనకి పిల్లల్లేరు. భార్య కనకదుర్గమ్మగారే ముచ్చటపడీ, చెల్లెలు కూతురు సుగుణను తెచ్చి ముద్దుగా పెంచుకుంటోంది. సుగుణ ఏణ్ణర్థం పిల్లప్పుడే, తలిదండ్రులు చనిపోయారు. పిల్లకేడెనిమిదేళ్లొచ్చేదాకా అల్లారుముద్దుగా సాగిందిగాని, అంతలో అదృష్టం పండి, ఆవిడ కడుపున ఓ కాయ కాయడంతో, సుగుణ మీద మోజు విరిగిపోయింది. నాటినుంచి ఆవిడ సుగుణను చీదరించుకోవడం, సాధించి బాధించడం సాగించింది.

రావుబహదూర్‌గారు యిది చూడలేక, ఏమీ చేయలేక మథనపడి, చివరకు పొరుగునేవున్న తన గుమాస్తా వెంగళప్పకూ, ఆయన భార్య శాంతమ్మకూ పిల్లని ఒప్పగించి, పెంచి పెద్దచేయమన్నాడు. చాటుగా తనకి చేతనైన సహాయం చేస్తూ వచ్చాడు.

సుగుణ కష్టపడి చదివి ఎం. బి. బి. ఎస్. కు వచ్చింది. ఆఖరు సంవత్సరం. కాలేజీలో సహవిద్యార్థి చంద్రం అనే కుర్రాడితో ఆమెకు విచిత్రమైన పరిస్థితులలో పరిచయం కలిగింది. రవి అనే పేరుతో గొప్పగొప్ప గేయాలు రాస్తున్న కవి అతనేనని తెలిశాక, గౌరవం ఏర్పడింది. తనను చిన్ననాటినుండి పెంచుతున్న 'తండ్రి', తను బాబాయి అని పిలుచుకొనే వెంగళప్పకు ఇతను వేలు విడిచిన మేనల్లుడని తెలిసినపుడు అపేక్ష కలిగింది. తనలాగే అతను తలిదండ్రులను పోగొట్టుకున్నాడని తెలిసినపుడు సానుభూతి కలిగింది. అతనికి సుస్తీచేసి తన యింటికి తీసుకువచ్చి సేవచేసినపుడు, అతని హృదయం ఎంత గొప్పదో తెలిశాక, మనసులు కలిశాక ప్రేమ అంకురించింది.

అంతలోనే సుగుణ జీవితంలోకి, అనుకోకుండా డాక్టర్ రఘు ప్రవేశించాడు. ఆమెను ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటా నన్నాడు. చంద్రానికి మనసిచ్చిపుచ్చుకున్న సుగుణ, తిరస్కరించింది. అయితే తన సుఖంకోసంకన్న, ఆమె సుఖంకోసం బాధపడేటంత గాఢంగా సుగుణను ప్రేమించిన చంద్రం, సుగుణ నిర్ణయాన్ని ఆమోదించలేదు. తనకి క్షయవ్యాధి వచ్చింది... ఇక తనను చేసుకుంటే ఆమె సుఖపడేది లేదు. తనకోసం సుగుణ అంత త్యాగం చెయ్యడం అతనికి ఇష్టంలేక పోయింది. వాదించి, వేధించి బలవంతాన సుగుణను ఒప్పించి, రఘుతో ఆమెకు వివాహం జరిపించాడు చంద్రం.

దంపతు లిద్దరూ డాక్టర్లే. వాళ్ళు చంద్రాన్ని పరీక్షించి పెద్ద వైద్యుల సలహాపై చికిత్సకై మదనపల్లి పంపించారు. అదృష్టవశాత్తు కొద్దికాలంలోనే అతనికి, వ్యాధి తిరుగుముఖం పట్టింది. పూర్తిగా కోలుకున్నాడు. అతను తిరిగి మద్రాసు వస్తున్నాడని తెలిసి ఇంటికి తీసుకురావడానికని కారులో స్టేషన్‌కు వెళ్ళిన రఘు, అకస్మాత్తుగా లారీకి ఢీకొట్టి మరణించాడు... జీవితం తనతో ఆడిన క్రూరమైన ఈ చెలగాటం చంద్రానికి గొడ్డలిపెట్టే అయింది. తను పోరిపోరి సుగుణను రఘుకిచ్చి పెళ్ళి చేయించాడు. ఏడాదికూడా తిరక్కుండా ఈ ఘోరం జరిగింది. ఈ నాడు ఆమె జీవితం ఇలా కావటానికి తనే కారణం. ఇందుకు తాను చేయగలిగింది




ఒకటే—ఆమెను పునర్వివాహానికి ఒప్పించడం; ఆమె సుఖపడేట్టు చూడడం.

సుగుణ ఇందుకు సుతరామూ ఒప్పుకోలేదు. "పెళ్ళినాడు నువ్వే దీవించావు—దంపతులుగా ఇద్దరూ ఒకరై, డాక్టర్లుగా ఒకరి కిద్దరై ప్రజాసేవ జేయమని. ఆయన ఆశయమూ అదే. నేను వారి స్మారక చిహ్నంగా మిగిలాను. ఆ ఆశయాన్ని కొనసాగించడమే నాకు తృప్తినీ, ఆనందాన్నీ ఇస్తుంది'' అంది. "మనం ఇక తరచు కలుసుకోవడం బాగుండదు. మన మనసులు మంచివైనా, లోకానికి వెరవాలి" అని కూడా చెప్పేసింది. చంద్రాన్ని నిర్వేదం ఆవరించింది.

కనకదుర్గమ్మగారి కన్నబిడ్డ వరలక్ష్మికి ఇంకా సంబంధాలు వస్తూ పోతూనేవున్నాయి. ఒక మంచిరోజు చూసి, రావుబహదూర్ గారు, తన కుమార్తెకు, చంద్రానికి వివాహంచేసి పుత్రికా భారం, తరువాత వ్యాపారం ఒప్పగించి, పత్రికాభారం తీర్చుకోవాలని సంకల్పించారు.

కాని చంద్రం ఇందుకు ఒప్పుకోలేదు. తనవల్ల, తన పట్టుదలవల్ల సుగుణజీవితం మోడువారిపోయింది... ఆమె అలా ఉండగా తాను వివాహం చేసుకుని నిశ్చింతగా ఉండగలగడం కల్ల.

ఆ జీవితం అంతే అయితే; ఈజీవితమూ ఇంతే అన్నాడు. చివరకి ఏ జీవితం ఏ దారిన వెళ్ళింది? ఏ వెలుగు ఎటు ప్రసరించింది? ఏ నీడ ఎటుపడింది? దూరానికి ఒకరూపంలో కనిపించిన వెలుగునీడల, క్రీనీడల మోస్తర్లు, దగ్గరకి వెళ్ళినా అలాగే ఉన్నాయా? మారాయా? ఎలా మారాయి?





శివగోవింద గోవింద

మాధవపెద్ది   రచన : కొసరాజు

శివగోవింద –గోవింద
హరిగోవింద – గోవింద   ॥శివగోవింద॥

సంతానమే లేక స్వర్గమే లేదని
చిట్టిపాపను తెచ్చి పెంచుకుంటారు
సంతు కలిగిందంటె చిట్టిపాపాయిగతి
శ్రీమతే రామానుజాయనమః   ॥శివగోవింద॥

తమ బాగుకోసమై తంటాలు పడలేరు
ఎదుటి కొంపకు ఎసరు పెడతారయా
పొరుగుపచ్చకు ఓర్వలేని వారిగతి
శ్రీమతే రామానుజాయనమః   ॥శివగోవింద॥

ఒరులకోసం త్యాగ మొనరించువా రొకరు
పరులమోసంచేసి బ్రతుకువా రింకొకరు
ఉపకారికే కీడు తలపెట్టు వారిగతి
శ్రీమద్రమారమణగోవింద   ॥హరిగోవింద॥

కలిమిలేనన్నాళ్ళు కలిసిమెలిసుంటారు
కలిమిచేరిననాడు కొట్లాడుకుంటారు
కలిమి పెంచే కాయ కష్టజీవులపని
శ్రీమతే రామానుజాయనమః   ॥శివగోవింద॥

ఆనాడు శ్రీయోగి వీరబ్రహ్మంగారు
కాలజ్ఞానము బోధ చేసేరయా
ఈనాడు కోష వెర్రి వెంగళప్పామాట
అక్షరాలా జరిగి తీరేనయా   ॥శివగోవింద॥



కర్నూలు ఎక్కడ కాకినాడెక్కడ

ఘంటసాల,
మాధవపెద్ది

రచన : కొసరాజు

మిత్రుడు : కర్నూలు ఎక్కడ? కాకీనాడెక్కడ?
ఏలూరు సాలూరు ఆలూరు ఎక్కడ?
వరంగల్లు ఎక్కడ?

మిత్రుడు : స్టాప్! రైల్వేగైడ్ చూడరా గురూ!

మిత్రుడు : శిష్యా! శాంతి! శాంతి!

వాడవాడలనుండి వాలాము యిక్కడ
లక్కా బంగారంలా అతుక్కుపోయామురా మైడియర్

బలే బలే మంచి రోజులులే
మళ్ళీ మళ్ళీ యిక రావులే
స్టూడెంట్ లైఫే సౌఖ్యములే
చీకూ చింతకు దూరములే ॥బలే బలే॥

చంద్రం : పంపునీళ్లు బందైతే స్నానానికి నోచుకోము

మిత్రుడు : "గుంయి"మని దోమలు దాడిచేస్తే శివరాత్రి జాగరణ చేస్తాము

చంద్రం : ఉప్పుకారంలేని హొటల్ సాపాటుతో చప్పబడి పోయామురా బ్రదర్

మిత్రుడు : ఎన్నికష్టాలురా నా తండ్రీ!

చంద్రం : భయపడకురా పుత్రా
కష్టాలను దిగమింగేస్తాం
కలకల నవ్వుతు గడిపేస్తాం ॥బలే బలే॥

చంద్రం : ఇంటికి పోతే "పెళ్ళి పెళ్ళి" అని వెంటబడతారు పెద్దలు

మిత్రుడు : పెళ్లి చేసుకుంటే "మేము మేమ"ని పుట్టుకొస్తారు పిన్నలు

చంద్రం : ఈ జంఝూటంతో విద్యానాశాయ సర్వం నాశాయ
నమోనమోరా బ్రదర్

మిత్రుడు : హా ! హతవిధీ !

చంద్రం : సహనం ! సహనం ! ఉపాయంవుంది నాయనా !

పెళ్ళికి బకాయి పెట్టేస్తాం
బాధ్యతలన్నీ నెట్టేస్తాం ॥బలేబలే॥

చంద్రం : బాధ్యతల నెన్నడూ మరచిపోరాదు
ప్రగతిమార్గము నెపుడూ వదలిపోరాదు
క్రమశిక్ష పాటించి కదలిపోవాలిరా బ్రదర్ !

మిత్రులు : హియర్ ! హియర్ !

చంద్రం : ఆదర్శంగా నడవాలి
అందరు 'భేష'ని పొగడాలి ॥బలే బలే॥

పాడవోయి భారతీయుడా !

వి. సుశీల, ఘంటసాల రచన : శ్రీశ్రీ

నర్తకి : పాడవోయి భారతీయుడా ! ఆడి
పాడవోయి విజయగీతికా ! ॥పాడవోయి॥

నర్తకి : నేడే స్వాతంత్ర్యదినం ! వీరుల త్యాగఫలం !
నేడే నవోదయం ! నీదే ఆనందం ! ॥పాడవోయి॥

చంద్రం : స్వాతంత్ర్యం వచ్చెననీ సభలేజేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించినదానికి సంతృప్తినిపొంది
అదే విజయమనుకుంటే పొరబాటోయి



ఆగకోయి భారతీయుడా ! కదలి
సాగవోయి ప్రగతిదారులా ॥ఆగకోయి॥

చంద్రం : ఆకాశం అందుకొనే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగ మింకొకవైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు
అలముకొన్న నీ దేశం ఎటు దిగజారు?

కాంచవోయి నేటి దుస్థితి — ఎది
రించవోయి ఈ పరిస్థితి
॥కాంచవోయి॥

చంద్రం : పదవీవ్యామోహాలు, కులమత భేదాలు
భాషా ద్వేషాలూ చెలరేగె నేడు
ప్రతిమనిషి మరియొకనీ దోచుకొనేవాడే
తన సౌఖ్యం తన భాగ్యం చూచుకొనేవాడే

స్వార్థ మీ అనర్థ కారణం — అది
చంపుకొనుటె క్షేమదాయకం ॥స్వార్థమీ॥

చంద్రం : సమసమాజ నిర్మాణమె నీ ధ్యేయం
సకలజనుల సౌభాగ్యమె నీ లక్ష్యం
ఏకదీక్షతో గమ్యం చేరిననాడే
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభ సందేశం.

ఓ రంగయో, పూల రంగయో

వి. సుశీల, ఘంటసాల   రచన: శ్రీశ్రీ

పనివాళ్లు. ఓ! రంగయో!
పూలరంగయో!
ఓరసూపు సాలించి సాగిపోవయో!
పొద్దు వాలిపోతున్నదోయి – ఇంత
మొద్దునడక నీకెందుకోయి?   ॥ఓ రంగయో॥

సుగుణ : పగలనక రేయనక – పడుతున్న శ్రమనంతా
పరులకొరకు ధారపోయు మూగజీవులు
చంద్రం : ఆటలలో పాటలలో ఆయాసం మరచిపోయి
ఆనందం పొందగలుగు ధన్యజీవులు   ॥ఓ రంగయో॥

సుగుణ : కడుపారగ కూడులేని తలదాచగ గూడులేని
ఈ దీనుల జీవితాలు మారుటెన్నడో
చంద్రం : కలవారలు లేనివారి కష్టాలను తీర్చుదారి
కనిపెట్టి మేలు చేయ గలిగినప్పుడే!   ॥ఓ రంగయో॥

సరిగంచు చీరెగట్టి

ఘంటసాల, సుశీల   రచన: కొసరాజు

అతను : సరిగంచు చీరెగట్టి బొమ్మంచు రైక దొడిగి
జలసాగ నాతో రాయే వయ్యారి రంగులబొమ్మ
సినిమాకు పోదంలేవే గయ్యాళి ముద్దులగుమ్మ

ఆమె : నిలపర చిన్నోడో నీ సోకు నీ ఠీకు
ఏడ నేర్చినావురో ఈ నీటు ఈ గోటు
మింగ మెతుకు లేదాయె మీసాలకు సెంటాయే
ఏ ఉటా బిడ్డాయె – ఓపిక వుడిగిపోయే
ఇంటో ఈగల మోత – బయట పల్లకి మోత ॥నిలపర॥

అతను : ఎహె ! సంపాదన జేసుకోను సత్తువున్నదీ
సక్కనైన సుక్క నాకు పక్కనున్నదీ
సామి సల్లగా జూసి సంతు వున్నదీ
ఇంతకన్న సొర్గమంటె ఎక్కడున్నదీ
నిలపవె నా రాణీ – నీ కేల భయమింక
ఆపవె బరాణీ – అల్లి బిల్లి కూతలింక

ఆమె : కనంగానె యేమాయె గాలికి వదిలావాయె
బిడ్డలంటె పట్టదాయె చదువుగోడవ యెత్తవాయె
బండచాకిరీతో వాళ్ళ బతుకే తెల్లారిపోయె ॥నిలపర॥

అతను : సంతానం పెరక్కుండ నూసుకుందామె
సంసారం సాగుమానం సేసుకుందామె
సిల్లరంత కూడబెట్టి దాచుకుందామె
పిల్లగోళ్ళ సదువులకు వాడుకుందామె
నిజమేనే రాణి నువ్వు చూపిన బాట
ఇంటానులేవే ఇకమీద నీ మాట

ఇద్దరు : సంతోష మే – సంతోష మే
సింతలేని కాపురమే శ్రీరంగమే
ఆలుమగలు ఒక్కటైతే ఆనందమే



కలకానిది, విలువైనది - బ్రతుకు

ఘంటసాల రచన: శ్రీశ్రీ

కలకానిది విలువైనది - బ్రతుకు
కన్నీటి ధారలలోనే బలిచేయకు ॥కలకానిది॥

గాలివీచి పూవులతీగ నేలవాలిపోగా
జాలివీడి అటులే దాని వదలివైతువా? ఓ -
చేరదీసి నీరుపోసి చిగురించనీయవా? ॥కలకానిది॥

అలముకొన్న చీకటిలోనే అలమటించనేల?
కలతలకే లొంగిపోయి కలువరించనేల?
సాహసమను జ్యోతిని - చేకొని సాగిపో- ॥కలకానిది॥

అగాధమౌ జలనిధిలోన ఆణిముత్యమున్నటులే
శోకాల మరుగునదాగి సుఖమున్నదిలే
ఏదీ తనంత తానై నీ దరికి రాదు

శోధించి సాధించాలి
అదియే ధీరగుణం! ॥కలకానిది

హాయిహాయిగా జాబిల్లి

పి. సుశీల, ఘంటసాల   రచన: శ్రీ శ్రీ

వరలక్ష్మి: హాయిహాయిగా జాబిల్లి – తొలి
రేయి వెండిదారా లల్లి
మందు జల్లి నవ్వసాగె ఎందుకో – మత్తు
మందు జల్లి నవ్వసాగె ఎందుకో ॥హాయి హాయిగా॥

తళతళ మెరిసిన తారక – తెలి
వెలుగుల వెన్నెల దారుల

చంద్రం: కోరి పిలిచెనో తన దరిచేరగా – మది
కలచెనో తీయని కోరిక ॥హాయి హాయిగా॥

మిలమిల వెలిగే నీటిలో – చెలి
కలువల రాణీ చూపులో

వరలక్ష్మి: సుమదళములు పూచిన తోటలో – తొలి
వలపుల తేనెలు రాలెనా ॥హాయి హాయిగా॥

విరిసిన హృదయమె
వీణగా – మధు
రసముల కొసరిన
వేళల



చంద్రం: తొలి పరువము
లొలికెడు సోయగం –
కని
పరవశమందెనో
మానసం
॥హాయి హాయిగా॥

చల్లని వెన్నెల సోనలు

వి. సుశీల, పి. జి. కృష్ణవేణి (జిక్కి)   రచన : శ్రీశ్రీ

సుగుణ : చల్లని వెన్నెలసోనలు
తెల్లని మల్లెలమాలలు
మా పాపాయి బోసినవ్వులే
మంచి ముత్యముల వానలు ॥చల్లని॥

వరలక్ష్మి : పిడికిలి మూసిన చేతులు–
లేత గులాబీరేకులు
చెంపకు చారెడు సోగకన్నులే
సంపద లీనెడు జ్యోతులు ॥చల్లని॥

సుగుణ : ఇంటను వెలసిన దైవము
కంటను మెరిసిన దీపము
మా హృదయాలకు హాయినొసంగే
పాపాయే మా ప్రాణము ॥చల్లని॥

నోచిన నోములపంటగ
అందరి కళ్ళకు విందుగా
పేరు ప్రతిష్ఠలే నీ పెన్నిధిగా
నూరేళ్ళాయువు పొందుమా ॥చల్లని॥

చిట్టీ పొట్టీ చిన్నారి పుట్టినరోజు

పి. సుశీల, స్వర్ణలత   రచన: శ్రీశ్రీ

సుగుణ, వరలక్ష్మి : చిట్టీ పొట్టీ చిన్నారి పుట్టినరోజు
చేరి మనం ఆడిపాడే పండుగరోజు

సుగుణ : వేడుకగా ఈ పూట
ఆడుదమా దొంగాట ॥చిట్టీ పొట్టీ॥

సుగుణ : కళ్ళకి పట్టీ చల్లగకట్టీ వీపుతట్టి పోతాం
తాకినవారి పేరొకసారి చెప్పవోయి చూతాం

వరలక్ష్మి : చురుకుతనం బుద్ధిబలం వుంటేనే చాలు
చూడకనే తెలియుకదా నిజానిజాలు ॥చిట్టీ పొట్టీ॥

వరలక్ష్మి : కన్నులుండి చూడలేరు కొంతమంది జనం
దారితప్పి తిరగడమే తెలివిలేనితనం

సుగుణ : మెదడు పదునుపెట్టాలి
అసలుదొంగను పట్టాలి ॥చిట్టీ పొట్టీ॥

సుగుణ : "అంబా" అనే అరుపు వినీ తల్లిని చేరు లేగ
నేలమీద పిట్టను పోల్చు నింగి నెగురు డేగ

వరలక్ష్మి : చీకటైనా చిటారుకొమ్మ చేరును కోతి
గురితెలిసి మసలుకొనే నిదానమే నీతి ॥చిట్టీ పొట్టీ॥

వెలుగునీడలు వెండితెర నవల వెల : 0.75 న. పై.

నిర్మాణ శాఖ:

మాటలు	...	ఆచార్య ఆత్రేయ
పాటలు	...	శ్రీ శ్రీ, కొసరాజు
సంగీత దర్శకుడు	...	పెండ్యాల
ప్లేబాక్	{	పి. సుశీల, ఘంటసాల, జిక్కి, స్వర్ణలత, మాధవపెద్ది సత్యం
నృత్యదర్శకులు	{	పి. యస్. గోపాలకృష్ణన్, ఎ. కె. చోప్రా
ఛాయాగ్రహణ దర్శకుడు	...	పి. యస్. శెల్వరాజ్
ఆపరేటివ్ కామెరామన్	...	'పాచూ'
శబ్దగ్రహణ దర్శకుడు	...	ఎ. కృష్ణన్, బి. ఎ.
రికార్డింగ్	...	టి. ఎ. జగన్నాథ్, B. A., L. C., & S. F.
కళాదర్శకులు	{	యన్. కృష్ణారావు, జి. వి. సుబ్బారావు
సెట్టింగ్స్	...	టి. నీలకంఠన్
పెయింటింగ్స్	...	ఆర్. జయరామరెడ్డి
మేకప్	{	పీతాంబరం, కె. నాగేశ్వరరావు, యస్. యస్. ఆర్. మూర్తి.
స్టిల్స్	...	M. సత్యం (జైహింద్ స్టుడియో)
పబ్లిసిటీ	...	స్టుడియో శర్మ - టి. వి. యస్.
ప్రొడక్షన్ ఛీఫ్	...	యస్. సంపత్
దర్శకత్వం	...	ఆదుర్తి సుబ్బారావు
అసోసియేట్	...	కె. విశ్వనాథ్, బి. యస్‌సి.
ఎడిటింగ్	...	యమ్. యస్. మణి

నిర్మాత : డి. మధుసూదనరావు, బి. ఏ.

స్టూడియో : వాహిని - విజయ

నవయుగ రిలీజ్

'స్వతంత్ర', విజయవాడ-2. పాటల పుస్తకం వెల : 0.10 న. పై.